22న శ్రీరామ పట్టాభిషేకం



సమావేశంలో పాల్గొన్న ఆలయ ప్రతినిధులు

చిలకలగూడ: అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమాలు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు సీతారాముల కల్యాణం, 12.30 గంటలకు తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు సీతారాముల పట్టాభిషేకం, రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను ఇక్కడి నుంచే వీక్షించేందుకు భారీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేశ్‌కుమార్, కమిటీ ప్రతినిధులు బాల భాస్కర్, ఆత్మరామ సూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్, రాధాకృష్ణశర్మ పాల్గొన్నారు.

బేగంపేటలో 'స్వచ్ఛ అభియాన్'



ఏకలవ్యుడి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మురళీధర్‌రావు

సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ సీనియర్ నాయకుడు నెమలి ఆనంద్ ఆధ్వర్యంలో బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారికాలనీలోని పలు ఆలయాల్లో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నల్లపోచమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా మందిరం, శివాలయాల ప్రాంగణాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు పాల్గొన్నారు. అనంతరం కాలనీ పార్కు సమీపంలో ఉన్న ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, మైసూర్ మధుసూదన్, శ్రవణ్, ఆకుల మహేశ్, మెంగని సతీశ్, అశోక్, వేణు, గణేశ్, జనార్దన్, మురళి, ప్రేమ్, శ్రీకాంత్, మధు, సిద్ధుగౌడ్, వినోద్‌యాదవ్, నాగరాజ్, విశాల్, నాగేందర్, టిల్లు, నిఖిల్, సాయిగౌడ్ తదితరులున్నారు.

పదవుల్లో సీనియర్లను విస్మరించొద్దు



బొమ్మ హన్మంత రావు

ఉస్మానియా యూనివర్సిటీ: నామినేటెడ్ పదవుల్లో సీనియర్లను విస్మరించరాదని ఓయూ విద్యార్థి నేత, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మ హనుమంతరావు టీపీసీసీ నేతలను శుక్రవారం కోరారు. ఓయూలో తెలంగాణ ఉద్యమ సమయంలో.. ఆ తర్వాత ఎలాంటి పదవులు లేకున్నా పని చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవుల నియామకాలలో తొలి ప్రాధాన్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు రాక పార్టీ ఆదరణ లేక సీనియర్ ఉద్యమ విద్యార్థి నాయకుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇతర పార్టీల నుంచి వచ్చేవారికి, జూనియర్లకు పదవులు కట్టబెడితే బీఆర్ఎస్ పార్టీ మాదిరి నాయకుల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని హనుమంతరావు హెచ్చరించారు.

అధ్యాపకుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డా.వెంకటేశ్వర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ నిజాం పీజీ కాలేజీ ఫిజిక్స్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ చిన్నాల వెంకటేశ్వర్లకు స్వామి వివేకానంద జాతీయ పురస్కారం లభించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. శుక్రవారం తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగిన కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్, సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్, ప్రొఫెసర్ రమణనాయక్ చేతుల మీదుగా డాక్టర్ వెంకటేశ్వర్లు 2024 స్వామి వివేకానంద సేవ పురస్కారాన్ని అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విద్యార్థులను సమాజ సేవలో భాగస్వాములను చేసినందుకుగాను నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ వారు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

సీపీఐ కేలండర్ ఆవిష్కరణ



సికింద్రాబాద్: సీపీఐ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. సీతాఫల్‌మండి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఈ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిరంతరం ఆందోళనలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, సోమయ్య, యాదగిరి, లతీఫ్, నాగరాజు, రాములు, ఖదీర్, శ్రీహరి తదితరులున్నారు.

ప్రత్యక్ష ప్రసారాల ఏర్పాట్లపై సమీక్ష



అమ్మవారిని దర్శించుకున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే ఏర్పాట్లపై మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి శుక్రవారం సమీక్షించారు. శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ క్రతువును ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అంతేకాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

అభయహస్తం పైనే ఆశలన్నీ..!

- పథకాల లబ్ధి కోసం దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

సికింద్రాబాద్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో విజయవంతంగా పూర్తయింది. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియ సైతం నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈక్రమంలో దరఖాస్తుల స్వీకరణ పూర్తయిందో లేదో అభయహస్తం దరఖాస్తుదారులు ప్రభుత్వ లబ్ధి కోసం ఎదురుచూస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల నుంచి మొత్తంగా 83,184 దరఖాస్తులు అందగా అందులో 61,870 దరఖాస్తులు అభయహస్తం పథకానికి సంబంధించినవి కావడం గమనార్హం.

వార్డు కార్యాలయాల్లో భద్రం..

డేటా ఎంట్రీ పూర్తి చేసిన అనంతరం దరఖాస్తుపత్రాలను డివిజన్ల వార్డు కార్యాలయాల్లో భద్రపరిచారు. అయితే, ఎక్కువ సంఖ్యలోని లబ్ధిదారులు తెల్లరేషన్ కార్డులు లేకపోయినా దరఖాస్తులు చేసుకున్నారు. కొందరు ఆధార్‌కార్డులు, కరెంటు బిల్లులు మాత్రమే అందించారు.

దరఖాస్తుల వివరాలు..

అభయహస్తం కోసం నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగుట్ట డివిజన్ నుంచి 13,592, తార్నాక నుంచి 13,355, మెట్టుగూడ నుంచి 6,523, సీతాఫల్‌మండి నుంచి 12,948, బౌద్ధనగర్ నుంచి 15,452 అభయహస్తం దరఖాస్తులు అందాయి. ఇతరత్రా పథకాల కోసం అడ్డగుట్ట నుంచి 3,387, తార్నాక నుంచి 4,557, మెట్టుగూడ 3455, సీతాఫల్‌మండి 5225, బౌద్ధనగర్ 4,690 మొత్తంగా 21,314 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

దరఖాస్తుదారుల ప్రదక్షిణలు..

దరఖాస్తులు చేసుకున్న వారంతా అభయహస్తం పథకం లబ్ధి కోసం ఎదురు చూస్తున్నారు. పెన్షన్ ఎప్పుడు వస్తుంది, ప్రభుత్వ ఇళ్లు దొరుకుతాయా? అనే సమాచారం కోసం జీహెచ్ఎంసీ, తహసీల్దార్, రేషనింగ్ ఆఫీసులతో పాటు చివరకు ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈక్రమంలో ఈ నెలాఖరులో ఎంట్రీ వివరాలను పునఃసమీక్ష చేస్తామని, ఇందుకోసం సూపర్ చెకింగ్ కార్యక్రమం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, దళారులను ఆశ్రయించడం లాంటి పనులు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

హామీల అమలుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



మోడల్‌కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీలోని పూజిత అపార్ట్‌మెంట్‌ను శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్ ముందున్న జీహెచ్ఎంసీ స్థలంలోని పార్కుతో పాటు ఫుట్‌పాత్‌ని అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌వాసులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈఎస్ఐ శ్మశానవాటికను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసే పనులు చేపట్టామని, కేఎల్ఎన్ పార్కుకు వచ్చేవారికి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అపార్ట్‌మెంట్‌లో నెలకు 20 వేల లీటర్ల వరకు ఉచితంగా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఈఎస్ఐ రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, పూజిత అపార్ట్‌మెంట్ అధ్యక్షులు వీరారెడ్డి, శశిధర్‌రెడ్డి, డీసీ జగన్, ఈఈ ఇందిర, జేఎస్టీ శాయి, బుచ్చిబాబు, డీఈ మోహన్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ అబ్దుల్ ఫహీం, శానిటేషన్ అధికారి రవి, వెటర్నరీ అధికారి ప్రతాప్, బీఆర్ఎస్ నాయకులు కొలను బాలరెడ్డి, శేఖర్, సరాఫ్ సంతోశ్, సురేశ్‌గౌడ్, పుష్పలత, జమీర్, సమీవుల్లా, శ్రీహరి, ఆకుల హరికృష్ణ, కిషోర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక పూజలు



ఆలయంలో సీఎస్ శాంతికుమారి

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్య ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారికి ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి స్వాగతం పలికారు. దేవాలయంలోని ఉప ఆలయాలను సందర్శించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టత, ప్రాముఖ్యత గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు సీఎం శాంతికుమారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

రైలు ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు



ప్రయాణికులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ప్రయాణికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ విభాగం రైల్వే పోలీసులు, ఏహెచ్‌టీయ సంస్థ ప్రతినిధులు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వెయిటింగ్ హాళ్లపై అవగాహన కల్పించడంతో పాటు ప్లాట్‌ఫామ్‌లపై ప్రదర్శనలు నిర్వహించారు. బాలల అక్రమ రవాణా, బాల కార్మికుల గుర్తింపు, మహిళలపై లైంగిక వేధింపులు తదితర నేరాలపై అవగాహన కలిగించారు. పోలీసులకు కంట్రోల్‌రూం నేరాల సమాచారం అందించే పద్ధతులను వివరించారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా ఆదేశం మేరకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాల్లో రైల్వే ఎస్సైలు ఏంఏ మాజిద్, డి.రమేశ్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రత్నశేఖర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగంలో పెసరపల్లి రత్నశేఖర్ పీహెచ్‌డీ డాక్టరేట్ అందుకున్నారు. ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సుజాత పర్యవేక్షణలో 'ఫీచర్ సెలక్షన్ యూజింగ్ ఎవొల్యూషనరీ అల్గోరిథమ్స్ ఇన్ బిగ్ డేటా' అనే అంశంపై పరిశోధనకు రత్నశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. తన పరిశోధనకు సహకరించిన ప్రొఫెసర్లు వెంకటదాస్, సురేశ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఆదర్శంగా ఉన్న మేనత్త, దివంగత విజయకుమారికి తన పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అంకితం ఇస్తున్నట్లు రత్నశేఖర్ చెప్పారు.

గొర్రెల పంపిణీ కోసం విజ్ఞప్తి



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

లాలాపేట: గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం సెక్రటేరియట్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో గొల్ల కురుమలు ఎదుర్కొంటున్న సమస్యలు భట్టికి వివరించారు. డీడీలు చెల్లించి చాలా కాలమైందని, పంపిణీ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. గొల్ల కురుమల్లో చదువుకున్న నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలని విజ్ఞప్తి చేశారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

బాలుడిని చేరదీసిన రైల్వే పోలీసులు



సికింద్రాబాద్: ఇంట్లో చెప్పకుండా నెల్లూరు జిల్లా నారాయణరావుపేట నుంచి నగరానికి వచ్చిన బాలుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు చేరదీసి సైదాబాద్‌లోని బాలుర హాస్టల్‌లో ఆశ్రయం కల్పించారు. ఎస్సై మాజిద్ శుక్రవారం తెలిపిన వివరాలు.. శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించిన బాలరాజు అనే ప్రయాణికుడు రైల్వేపోలీసులకు సమాచారం అందించాడు. సదరు బాలుడిని పోలీసులు విచారించగా తన పేరు షేక్ మహ్మద్ రసూల్(13) అని చెప్పాడు. తన అన్నను చూడటం రైలులో నగరానికి వచ్చినట్టు తెలిపాడు. బాలుడిని హాస్టల్‌కు తరలించిన పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అన్న కోసం మూలుగ దానమిచ్చిన చిన్నారి

- జాంబియా నుంచి ఇక్కడకు వచ్చిన కుటుంబం
- కిమ్స్ ఆస్పత్రిలో విజయవంతమైన మార్పిడి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైద్యులు

సనత్‌నగర్: జాంబియా దేశానికి చెందిన ఏడేళ్ల చిన్నారి తన సోదరుడి ప్రాణాలు కాపాడింది. చిన్న వయస్సులోనే తన శరీరంలోని మూలుగ(బోన్‌మారో)ను దానం చేసి సికిల్‌సెల్ డిసీజ్‌తో బాధపడుతున్న 14 ఏళ్ల తన అన్న ప్రాణాలు నిలిబెట్టింది. విజయవంతంగా మూలుగ మార్పిడి చేసిన కిమ్స్ బీఎంటీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ నరేంద్రకుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. జాంబియా దేశం లుసాకా నగరానికి చెందిన 14 ఏళ్ల బాలుడు తీవ్రమైన సికిల్‌సెల్ డిసీజ్‌తో బాధపడుతున్నాడు. దీంతో మూలుగ నుంచి మూల కణాలు సేకరించి, వాటిని బాధితుడికి ఎక్కించాల్సి ఉంది. దీంతో తన చెల్లెలు, ఏడేళ్ల బాలిక మూలుగను దానం చేసింది. తమ దేశంలో వ్యాధిని గుర్తించే సరైన సౌకర్యాలు కూడా లేకపోవడంతో కిమ్స్ ఆస్పత్రికి వచ్చినట్టు బాధిత కుటుంబం తెలిపింది.

గుండెపోటుతో ఓయూ విద్యార్థి మృతి



చిరంజీవి(ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: గుండెపోటుతో ఓయూ విద్యార్థి శుక్రవారం మృతి చెందాడు. చిరంజీవి(30) క్యాంపస్‌లోని కామర్స్ కాలేజీలో ఎమ్‌కాం పూర్తి చేసి పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారని విద్యార్థులు తెలిపారు.

నగరంలో 'ఓల్టా రైడ్' సేవలు

లక్డీకాపూల్: నగరంలో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే క్రమంలో వోల్టా రైడ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైడ్ షేరింగ్ స్టార్టప్ వ్యవస్థాపకుడు శశికాంత్ కనపర్తి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా(జీరో పర్సెంట్ కమిషన్), డ్రైవర్లకు తక్షణ చెల్లింపులే లక్ష్యంతో ఈ సేవలను అందించనున్నట్టు చెప్పారు. మార్కెట్‌లోని ఇతర రైడ్ షేరింగ్ సర్వీసుల కంటే భిన్నంగా ఓల్టా సంస్థ కస్టమర్లను గమ్య స్థానాలకు చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని... ఇందులో భాగంగా సంప్రదాయ రైడ్ షేరింగ్ సంస్థల నుంచి డ్రైవర్లు తరచు ఎదుర్కొనే అధిక కమిషన్ భారం, ఆలస్య చెల్లింపుల భారం నుంచి విముక్తి కలిగించామన్నారు. 'రైడ్ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని, తక్కువ ఛార్జీలు చెల్లించేలా మరో రైడ్ కోసం ఎదురు చూసే పనిలేదన్నారు. ఓల్టా యాప్‌లో తక్కువ ప్రయాణ ధరల్ని సూచించేలా యాప్‌లో కస్టమర్ల కోసం సరికొత్త ఫీచర్లను అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా తక్కువ ఛార్జీలను చెల్లించి వారి చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని ఓల్టా సీఈఓ రాజా విక్రమ్ తెలిపారు. ఓల్టా యాప్ ఐఓఎస్, ఆండ్రాయిడ్ యాప్ స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, హెచ్‌పీఎస్ బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జెక్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, సెయింట్ థెరిస్సా హాస్పిటల్, ఐజీపురం, బేగంపేట బస్తీ, కట్టమైసమ్మ టెంపుల్ లేన్, హెచ్‌పీఎస్ మెయిన్‌రోడ్డు, శివం పెట్రోల్ బంక్, శ్యాంలాల్ బిల్డింగ్ ఏరియాలో విద్యుత్ ఉండదు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఐజీపురం, బేగంపేట బస్తీ, కట్టమైసమ్మ టెంపుల్ లేన్, హెచ్‌పీఎస్ మెయిన్‌రోడ్డు, శివం పెట్రోల్ పంప్, శ్యాంలాల్ బిల్డింగ్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయి.

బన్సీలాల్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో..

ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఏజే కాలనీ 1 అండ్ 2, రామాలయం, గాంధీనగర్, సీసీనగర్ కమ్యూనిటీ హాల్, ఉప్పలమ్మ టెంపుల్, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, ఆర్పీసీ కాంపౌండ్, ఉ.11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైశ్రాయ్, జీరా క్లబ్ అండ్ గార్డెన్ ఏరియా, అన్న విశ్వనాథం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోటనీ స్కూల్, టీఎస్ టూరిజం, లారీ అడ్డా, రాగి చెట్టు ఏరియా, రాణిగంజ్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమాన్ టెంపుల్, నాగన్నకుంట సికింద్రాబాద్ ఏడీఈ ఆదినారాయణ తెలిపారు.

వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో...

రసూల్‌పురా: మరమ్మతుల కారణంగా వివిధ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సికింద్రాబాద్ ఏడీఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉ.10.30 గంటల నుంచి మ.12.30 వరకు గన్‌రాక్ సబ్‌స్టేషన్ లాల్‌బజార్ ఫీడర్ పరిధిలో డీఏడీ క్వార్టర్స్, హనుమాన్ టెంపుల్, తిరుమలగిరి పీఅండ్‌టీ కాలనీ, డీఐడీ క్వార్టర్స్, నెహ్రూనగర్ సబ్‌స్టేషన్ పరిధి ఎల్ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలో ఎల్ఐసీ కాలనీ, వైడబ్ల్యూసీఏ, జడ్జ్ క్వార్టర్స్, సరస్వతి కాలనీ, భూసారెడ్డి గూడ, కోర్ట్ ఏరియా, ఫిషర్‌పురా, గాంధీ కాలనీ, ఎల్ఐసీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్టు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు గన్‌రాక్ సబ్‌స్టేషన్ ఏడబ్ల్యూహెచ్‌ఓ ఫీడర్ పరిధిలో జూపిటర్ కాలనీ, ఏడబ్ల్యూహెచ్‌ఓ ఏ, బీ, సీ. డీ, ఈ బ్లాక్ టు ఎం బ్లాక్ వరకు, టీచర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలో టీచర్స్ కాలనీ, డెక్కన్ క్లబ్, రిలయన్స్ డిజిటల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమోట రూ.19, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చ కాకర 55, పందిరి బీర 40, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 23, గుండు బీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీరదోస 15, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 18, చామగడ్డ 50, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

విమాన ప్రదర్శన కోసం వచ్చి మృతి

అమీర్‌పేట: వింగ్స్ ఇండియా-2024 ప్రదర్శనకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ వ్యక్తి హోటల్ గదిలో మృతి చెందాడు. ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాదరావు తెలిపారు. ముంబాయిలోని ములంద్‌కాలనీలో ఓల్డ్ బ్యారక్ ప్రాంతానికి చెందిన హనీ కృపాలి(36) గల్లంగర్ ఇన్సూరెన్స్ బ్రోకర్ సంస్థకు ఉపాధ్యక్షుడు. బేగంపేటలో నిర్వహిస్తున్న విమానయాన ప్రదర్శనకు హాజరయ్యేందుకు ఈ నెల 17వ తేదీ రాత్రి నీరవ్ ఠాకూర్(33)తో కలిసి నగరానికి వచ్చాడు. ఎస్ఆర్ నగర్‌లోని హోటల్ క్రిష్ ఇన్‌లో వీరిద్దరూ వేర్వేరు గదుల్లో బస చేశారు. 18వ తేదీ ఉదయం కృపాలికి ఫోన్ చేసి కార్యక్రమానికి ఎప్పుడు వెళ్దామని ఆరా తీయగా 8.30 గంటలకు బయలుదేరదామని కృపాలి తెలిపాడు. అయితే, సమయం దగ్గర పడినా గది నుంచి బయటకు రాకపోవడంతో ఠాకూర్ మరోసారి ఫోన్ చేశాడు. ఎంత సేపటికీ ఫోన్ తీయకపోవడంతో హోటల్ సిబ్బందితో కలిసి ఠాకూర్ మాస్టర్ కీతో గది తాళం తెరిచాడు. కృపాలి మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని కృపాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఇదిలా ఉండగా, కృపాలిని బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించి ఉండవచ్చని పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ద్వారా వైద్యులు తెలిపారు.

NOTICE

Sub:- Cooperation Department - Osmania University Employees Cooperative Housing Society Ltd, O.U. Colony, Shaikpet, Hyderabad, Regd. No.TAB-261 - Convening the General Body meeting -Notice issued-Regarding.

****

All the members of the Osmania University Employees Cooperative Housing Society Ltd are hereby informed that, it is decided to conduct the **General Body Meeting of the society on 04-02-2024(SUNDAY) at 11:00 AM at H.No.1-8-284/406, Plot No.406, O.U Colony, Shaikpet Mandal, Hyderabad-500008** to discuss and decide the matter related to the following agenda.

AGENDA

1. Income and expenditure for the period from 18-08-2022 to 31-12-2023.
2. Placing the Audit Reports for the year 2021-22.
3. Implementation of Awards issued by the Arbitrator and regularization of plots who have paid the cost.
4. To discuss the land released from the encroachers near water tank.
5. Any other matter with the permission of the chair.

All the members are requested to attend the General Body Meeting to discuss and decide the above stated agenda items.

Date: 16-01-2024

Sd/- ASST.REGISTRAR / OFFICIAL PERSON INCHARGE

తెలంగాణ ఉద్యమకారుడు శ్రీధర్ మృతి



శ్రీధర్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

సికింద్రాబాద్: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. 2001 నుంచి జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. సీతాఫల్‌మండి బీఆర్ఎస్ నాయకుడిగా కొనసాగుతున్న శ్రీధర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారాసీగూడలోని ఆయన నివాసానికి వచ్చిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీతాఫల్‌మండి శ్మశానవాటిన వరకు నిర్వహించిన అంతిమయాత్రలో ఎమ్మెల్యేతో పాటు పెద్దసంఖ్యలోని బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



మల్లిక(ఫైల్ ఫొటో)

లాలాపేట: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన సురేశ్, జ్యోతి దంపతుల కుమార్తె వి.మల్లిక(17) విద్యానగర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 18వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ భోజనం చేసి నిద్రలోకి వెళ్లారు. తర్వాత రోజు ఉదయం 5 గంటలకు నిద్ర లేచే సరికి మల్లిక ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో సురేశ్ ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఓయూ దూరవిద్య రెండో విడత ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ డిగ్రీ కోర్సులతో పాటు పీజీ, పీజీ డిప్లొమా, ఇతర సర్టిఫికెట్ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి మార్చి 31 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలను osmania.ac.in లో చూడవచ్చు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379